# సంతకం చేసి చూడు

"గురూ ! నీ బంగారు సంతకం ఈ కాగితం మీద కావాలి ! ఓ చిన్ని సంతకం !" సీరియస్ గా తన పని చేసుకుపోతున్న సుబ్బారావు దగ్గరికి వచ్చి చంద్రమోహన్ అడిగాడు.

" నా సెక్షన్ వేరు - నీ సెక్షన్ వేరు - నా సంతకం ఎలా చెల్లుతుంది?" కొంచెం ఆశ్చర్యంగా అడిగాడు సుబ్బారావు.

" అబ్బే ! ఇది ఆఫీసుది కాదు గురూ - కొంచెం పర్సనల్ - నీ పొట్టి సంతకం అయినా చాలు ప్లీజ్ !" చంద్రమోహన్ చెప్పాడు.

" పెడతాను కాని - అసలు ఇది ఏం కాగితమో ఏంటో చూడాలిగా?"

"ఏం నామీద నమ్మకం లేదా?" కోపంగా అడిగాడు.

" నమ్మకం కాదు బ్రదర్ ... కాగితం మీద సంతకం పెట్టేప్పుడు కాస్త చూసి పెట్టమని మా బామ్మ చెబుతూ ఉండేది. ఓ స్సారి ఏం జరిగిందంటే ఓ ఆఫీసులో - ఆ ఆఫీసరుకు తన క్రింది ఉద్యోగులపైన నమ్మకం జాస్తిగా ఉండేది. కాగితం రావడం ఆలశ్యం ఓ గుడ్డి సంతకం పడేసేవాడు. ఎంత నమ్మకమంటే అది ఎంత యింపార్టెంటు ఫైలు అయినా చదివేవాడు కాదు - పొడవడమే పొడవడం సంతకాన్ని ! ఇది చూసి ఓ కుర్ర గుమాస్తా ఓ కాగితం టైపు చేసి తన ఫైలు తో పాటు పంపించాడు - అలవాటుగా దానిమీద కూడ చేసి పడేశాడు ఆఫీసరు. ఇంక అదే పనిగా ఆ కుర్ర గుమాస్తా ఆ కాగితాన్ని హెడ్ ఆఫీసుకు పోస్ట్ చేశాడు.

రెండు రోజులు తర్వాత పై ఆఫీసు నుండి ఆ ఆఫీసరుకు ఫోన్ వచ్చింది "నీకిదేం పోయే కాలమయ్యా ! నిక్షేపం లాంటి జాబుకు రిజైన్ చేస్తావా? నువ్వు చేసే బోడి పనికి బయట నెలకు ఓ వెయ్యి కూడ నీకు ఎవరూ యివ్వరు - అటువంటిది వేలకు వేలు వచ్చే జాబుకు రిజైన్ చేస్తావా - అయితే నీ ఖర్మ ! ఫైలు మీద సంతకం పెట్టి పంపిస్తున్నాను - ఈ నెలాఖరుకు రిలీవు అయి ఏడుద్దువు గానిలే ! అని చెడా మడా పై ఆఫీసరు తిట్టాడు.

ఓర్నాయనో ! నేనెప్పుడు రిజిగ్నేషన్ లెటరు పంపించాను - నాకటువంటి

ఉద్దేశ్యం లేదు సార్ – ఆడ పిల్లలు కల వాడ్ని – ఇది పోతే నేను అడుక్కు తినాల్సి వస్తుందని లబలబ లాడుతూ హెడ్డాఫీసుకు పరుగెత్తాడు. దాన్ని క్యాన్సిల్ చేసుకోవడానికి నానా తిప్పలు పడాల్సి వచ్చింది." అంటూ చిన్న కథ చెప్పాడు సుబ్బారావు.

" అయితే నీకళ్ళకు నేను కూడ అలా కనిపిస్తున్నానా గురూ ?" నిష్ఠూరంగా మాట్లాడాడు చంద్రమోహన్.

" కాదులే బ్రదర్ ఏదో జోక్‌కు – ఇంతకీ ఈ కాగితం ఏంటట ! నీ సెక్షనులో అంత మందిని పెట్టుకుని నా దగ్గర కెందుకొచ్చినట్లో ?"

" చెప్పానుగా – నీ చిన్న సంతకం కాగితం యిస్తే వాళ్ళు నా డబ్బు నాకిస్తారు" చెప్పాడు.

" అరె బాబా ! నా సంతకానికి నీకు రావల్సిన డబ్బుకు సంబంధం ఏముంది?"

" వాళ్ళు ష్యూరిటీ లేంది యివ్వడం లేదుగా –" అసలు సంగతి చెప్పాడు.

ష్యూరిటే – అనంగానే ఉలిక్కి పడ్డాడు సుబ్బారావు.

" ష్యూరిటే – యూ మీన్ పూచీ – జామీన్– నో – నో నేనెవరికీ ష్యూరిటీలు యివ్వను – అలా యిచ్చే మా తాత ముష్టి ఎత్తుకు బ్రతికాడు ఉన్న ఆస్తి అంతా పోగొట్టుకుని –" సుబ్బారావు ఖరా ఖండితంగా చెప్పేశాడు.

"అయ్యో ! ఇది అలాంటి ష్యూరిటీ కాదులే ! ఒక ఫార్మాలిటీ! అయినా నేనున్నాను – నా జీతం ఉంది – నా ఆస్తి ఉంది – అంతా పోయింతర్వాత కదా – వాళ్ళు నిన్ను అడగడానికి వచ్చేది?" చంద్రమోహన్ అతని అజ్ఞానానికి చింతిస్తూ అసలు విషయం చెప్పాడు.

"నో నో ! నేనెవరికీ ష్యూరిటీ యివ్వను – ఇవ్వదల్చుకోలేదు".

"అయ్యో ! సుబ్బారావు – అలా అంటే ఎలా ? నిన్ను నమ్ముకుని వచ్చాను బాబు."

"ఈ ఆఫీసులో ఇంత మంది పని చేస్తున్నారుగా – ఇంకెవరిదగ్గరన్నా పెట్టించుకు పో !" అని చెప్పి పంపించాడు.

కాని ఓ గంట కల్లా మళ్ళీ ప్రత్యక్షమయ్యాడు.

"గురూ ! అందరూ సుబ్బారావు నీకు చాలా క్లోజ్ గదా - ఆమాత్రం సంతకం పెట్టలేడా అని వెక్కిరిస్తున్నారు - కాబట్టి వాళ్ళకి బుద్ధి చెప్పడానికన్నా ఓ సంతకం పారెయ్యి గురూ!" అంటూ నచ్చచెప్పాడు చంద్రమోహన్

" క్లోజ్ నెస్ వేరు - ఫైనాన్సు వేరు !"

" నాన్సెన్సు ! మన స్నేహానికి ఇది సవాల్ గురూ ! నేనూ ఎంప్లాయినే నీవు ఎంప్లాయివే - ఒకరి కొకరం సాయం చేసుకోబోతే మనకు ఇంకెవరు చేస్తారు?" అంటూ కాళ్ళ వేళ్ళా పడ్డాడు.

సుబ్బారావు ఆ కాగితం వంక ఓ చూపు విసిరాడు అది ఓ చిట్ కంపెనీ ఇచ్చిన ష్యూరిటీ కాగితం .

" ఇంతకీ ఏమంటాడు - నువ్వు మెంబరుగా చేరేప్పుడు ఇవన్నీ చెప్పాడా?"

" బస్సు ఖాళీగా వున్నా ఫర్వాలేదు కాని - రేట్లు తగ్గించనంటాడు." అలాగా కాస్త అమౌంటు కయినా ఇద్దరన్నా సంతకం పెట్టాలిట హామీ దారులుగా. అస్సలు నా లాంటి పెద్ద మనుషులు వాడికి దొరకడం చాలా కష్టం - పైగా ఇదో బోడి ఫార్మాలిటీ!" చెప్పుకొచ్చాడు.

చిట్ ఫండ్ కంపెనీ  గురించి - దాని శక్తి సామర్థ్యాలు గురించి ఊదరగొట్టేశాడు - చంద్రమోహన్‌ది మంచి కంఠ స్వరం - మంచి తెలివి తేటలున్నాయి మొహం కూడా చాలా అమాయకంగా ఉంటుంది.

" డబ్బు నెలనెల కట్టే బాధ్యత నాది - కావాలంటే నాకు అప్పిచ్చిన వాళ్ళని అడిగి చూడు - అయినా స్నేహంలో నువ్వు కూడ ఇంత నీచంగా ఆలోచిస్తావనుకోలేదు" అని బుడి బుడి దీర్ఘాలు తీశాడు.

చంద్రమోహన్ మాటలకు కరిగిపోయాడు.

ఎవరూ ఆదుకోకపోతే స్నేహానికి అర్థం ఏముంది కనుక?

అవసరాలు అందరికీ వస్తుంటాయి - ఈ రోజు నేను బాగున్నాను - నాకు ఎవరి సహాయంఅక్కరలేదు అని అనుకోవడానికి వీలు లేదు.

సంఘం అన్న తర్వాత ఇచ్చి పుచ్చుకోడాలు ఉండాలి!

ఇలా ఆలోచించి, చించి, ఆ కాగితం మీద ఓ సంతకం పొడిచాడు ఆ మాత్రానికి థ్యాంక్సు చెప్పి అతను పొంగి పోయాడు... వెళ్ళి పోయాడు.

కొన్నాళ్ళకు చంద్రమోహన్ కు బదిలీ అయింది. ఎక్కడో దూరంగా వేశారు - మూట ముల్లె సర్దుకుని వెళ్ళి పోయారు.

కాలం తిరుగుతున్నది. అతన్ని అతనికిచ్చిన ష్యూరిటీని పూర్తిగా మర్చిపోయాడు.

ఓ రోజు కోర్టు నుండి నోటీసు వచ్చింది సుబ్బారావుకు ఫలానా చంద్రమోహన్ డబ్బు కట్టలేదు - ఆ డబ్బును నీ శాలరీ నుండి రికవరీ చేస్తాం నెలా నెలా లేదా మొత్తం నువ్వు కట్టెయ్యి అని.

అది చూసి సుబ్బారావు లబో దిబో అని ఏడ్చాడు.

'ఏడిస్తే లాభం లేదు - జరగాల్సిన కార్యక్రమం చూడండి' అని ఎవరో సలహా ఇస్తే - ఆ సాయంత్రం ఓ కుర్ర లాయరును వెతికి వెతికి పట్టుకున్నాడు - తన బాధంతా చెప్పుకున్నాడు.

" చూడండి ! ఈ చిట్‌ఫండ్ కంపెనీలకు ఏ బుద్ధి వున్న వెధవా సంతకం చెయ్యడు - "

" ఎందుకని ? "

" శాలరీడు ఎంప్లాయిస్ అయితే వాళ్ళకు లడ్డులా దొరుకుతారు ఎక్కడికీ పోలేరు - ఓ చిన్న నోటీసు యిస్తే తెచ్చి డబ్బు కట్టేస్తారు - "

"అయినా వాళ్ళు నన్ను పట్టుకోవడమేంటి - వాడి శాలరీ అటాచ్ చెయ్యాలి కాని.... నెల నెల రెండు వేలు పట్టుకుంటే నేనేం తిని బ్రతకాలి!" గోల గోల చేశాడు.

" అయ్యా ! ఆ తెలివి కాగితం మీద సంతకం పెట్టే అప్పుడు ఉండాలి - అక్కడేమో ఇండివిడ్యుయల్లీ అనీ - జాయింట్లీ అండ్ సెవరల్లీ అని సంతకాలు చేస్తున్నారు చాలామంది. దాని అర్థం వాడు కట్టక పోయినా నేను కడతాను అని. అందుకని మీకు నోటీసు వచ్చింది."

" నిజమే కాని -- వాడికి ఆస్థి ఉంది ఉద్యోగం ఉంది - వాడిని పట్టుకోకుండా

నా మీద పడ్డారు – ”

“బహుశ ఉద్యోగం ఉండి ఉండక పోవచ్చు – లేదా మినిమమ్ శాలరీ ఉంటే రికవరీ చేయకుండా స్టే తెచ్చుకుని ఉండచ్చు – సాధారణంగా చిట్‌ఫండ్ కంపెనీలు ఆస్తి జోలికి పోవు – అదంతా ఓ పెద్ద ప్రాసెస్ ! ఆ న్యూసెన్సు ఎవరు భరిస్తారు – అందుకని ఉద్యోగస్తుల మీద పడతారు –” చెప్పాడు లాయరు.

“ఏదైనా – నా శాలరీనుండి కట్ చేయకుండా చూడండి!”

“ కడుపొచ్చింతర్వాత కనక తప్పదు అది మనం తెచ్చుకున్నా – ఇతరులు మనకిష్టం లేకుండా చేసినా – పాపం చేసింతర్వాత అనుభవించక తప్పదు.” ఆ లాయరు చెప్పాడు.

“ అయితే ఏంటయ్యా బాబు నువ్వు చెప్పేది – సీనియరు లాయరు దగ్గరికి పొమ్మంటావా?” కోపంగా అడిగాడు సుబ్బారావు.

“ చూడు సుబ్రావు ! నువ్వు నా దగ్గరికి వచ్చి కాస్త పుణ్యం చేసుకున్నావు – నువు ఏ సీనియరు లాయరు దగ్గరికి పోయినా – ఆఖరికి పాల్కీ వాలా దగ్గరకు పోయినా ఓడి పోక తప్పదు.” తేల్చి చెప్పాడు.

“ ఇంకెందుకయ్యా మీరుండేది... న్యాయంను గెలిపిస్తామని పెద్ద నల్లకోటు తగిలించుకుని కోర్టుకు బయలు దేరుతారు?!” నిలదీశాడు.

“సరే ! జరిగేది ఎలాగూ జరుగుతుంది. ఆ జరిగే దాన్ని నా తెలివి తేటలతో కొన్ని నెలలు వాయిదా వేయిస్తూ వస్తాను. సరేనా ? ” లాయరు చెప్పాడు.

“ ఇంకెందుకయ్యా మీకు వేలకు వేలు ఫీజులు తగలెయ్యడం – మీ చుట్టూ తిరగడం?” చికాకు పడ్డాడు.

“అన్ని చోట్ల సంతకాలు చేసి – పూర్తిగా మునిగి పోయింతర్వాత మా దగ్గరికి వస్తే మేం మటుకు ఏం చెయ్యగలం – ఆ తెలివి ముందుండాలి – ముందుగా వచ్చి నన్ను అడిగి ఉంటే సంతకం పెట్టద్దని చెప్పేవాడ్నిగా !”

ఇలా వాదోపవాదాలు అయింతర్వాత చెరువు మీద కోపం వలన నష్ట పొయ్యేది తనే అని తెల్సుకుని లాయరు ఫీజు చెల్లించి – ఆయన పెట్టమన్న చోట్ల సంతకాలు

పెట్టేసి - కాళ్ళు చేతులు ఊపుకుంటూ యింటి కొచ్చి పడ్డాడు.

అతని వాలకం చూసి ఏదో జరిగిందని గ్రహించి - అప్పల నర్సమ్మ - ఉరఫ్ - అప్పలమ్మ లాలించి - బుజ్జగించి విషయం అంతా రాబట్టింది.

“ అయ్యో ! అయ్యో ! ఆ చందూ గాడు ఇంత పని చేస్తాడా - రానివ్వండి మనింటికి కాళ్ళు యిరగ్గొడతా !” అంటూ ఆవేశ పడింది.

“ అసలు వాడు వస్తే కదే నువ్వాపని చేసేది - ఇప్పుడు ఎక్కడ చచ్చాడో ?”

“ అదేంటి మీ సంస్థలోనే కదా పని చేస్తున్నది ... ఆ మాత్రం పట్టుకోలేరా? ఎంత ఆలిండియా ట్రాన్సుఫరులుంటే మాత్రం వెతికి పట్టుకో లేరా!”

“ కష్టపడాలి ... చాలా కష్ట పడాలి !”

“ ఆ పడేదేదో - తొందరగా పడి - వాడి దగ్గరికి పోయి ముక్కు పిండి వసూలు చేసుకురండి ... వాడు కట్టాల్సిన డబ్బు కోర్టు ద్వారా మీ శాలరీలో కట్ అవుతుందంటే  ఎంతనామర్దా అవ్వ! అయినా నాతో ఒక్క మాట చెప్పకుండా సంతకం ఎందుకు పెట్టారు.”

“ ఏదీ ! వాడు నాకు అంత టైమిస్తే గదా - అర్జెంటు అంటూ వెంట పడ్డాడు మరి !”

“ అదే అంతా మీ అసమర్థత - ఆఫీసులో అన్ని వందల మంది ఉంటే మిమ్మల్ని ఎందుకు ఎంచుకున్నాడు ?” అప్పలమ్మ క్లాసు భయంకరంగా సాగింది.

సుబ్బారావు కు తల వాచిపోయింది.

అతని అడ్రసు కోసం ఎంతో మందికి లెటర్లు రాశాడు...

ఓ నెల రోజులు కష్ట పడ్డ తర్వాత అతను ఎక్కడ పని చేస్తున్నది తెల్సింది....

ఎక్కడో ముంబాయి అవతల .... దగ్గర కాదు - వెరసి రెండు రాత్రుల ప్రయాణం ... మొత్తం ఒక వారం సెలవు పెడితే గాని అంత దూరం పోయి రాలేడు.

అంత సెలవు ఈ సీజనులో దొరకడం కష్టం !

అందుకని అతగాడికి రిజిష్టరు లెటర్లు రాశాడు ముందు దీనంగా - జవాబు లేదు.

ఆ తర్వాత తిడుతూ రాశాడు.

జవాబు లేదు...

ఆపైన శపిస్తూ రాశాడు...

జవాబు రానేలేదు...

ఇలా కాదని ... ఫోన్ నెంబరు సేకరించి యస్.టి.డి. చేశాడు - బిల్లు భలేగా పడింది కాని అతను మటుకు ఎప్పుడూ దొరకలేదు లైన్లో.

ఇక్కడ అప్పుడప్పుడు లాయరును దర్శించుకుని చేతి చమురు వదిలించుకుంటున్నాడు... ఎప్పుడో బాకీ పడినట్లు .

ఇంట్లో అక్షింతలు రెగ్యులర్‌గా పడుతున్నాయి - రెండు పూటలా...

ఈ సంగతి స్నేహితులకు తెల్సిపోయి - వాళ్ళు నవ్వుకో సాగారు -

" వీడేమన్నా పోటుగాడా సంతకం పెట్టడానికి - మా దగ్గరికి రాలేదే ? వచ్చినా మేం చేస్తామా ?" ఇలా యికయికలు - పకపకలు

కొందరు పరామర్శిస్తూ ఉంటారు కూడ

"సుబ్రావు కేసు ఎంత దాకా వచ్చింది ... శాలరీ రికవరీ యింకా ప్రారంభం కాలేదుగా - "

" అయినా సుబ్రావుకేంలే - ఇటువంటివి నాలుగు వచ్చినా చలించడు"

" పోయి పోయి - ఆ దొంగోడికి ఎందుకిచ్చావు - నాకిచ్చినా బాగుండేది."

ఇంకా కొందరు ష్యూరిటీ సంతకాల కోసం రాసాగారు - పెట్టనంటే కొందరు 'ఆ చంద్రమోహన్ గాడికైతే బాగా పెట్టావు - మా కెందుకు పెట్టవు' అని తగూలాటకు కూడా వస్తున్నారు.

ఈ వార్త బంధువులకు కూడ తెల్సిపోయింది. అతన్నో వెర్రివెంగళప్పలా చూడ సాగారు. అతను అసమర్థుడని వాళ్ళకు తెల్సుగాని - మరియింత అని తెలీదు.

ఏతా వాతా సుబ్రావుకు భక్తి పెరిగి దేవుళ్ళ చుట్టూ తిరగ సాగాడు రోజూ ...

కొన్ని నెలల తర్వాత అతి కష్టం మీద సెలవు దొరక పుచ్చుకుని - చేతిలో

కొన్ని వేలు పట్టుకుని రైలెక్కాడు, చంద్రమోహన్ దగ్గర వసూలు చేసుకొద్దామని. అప్పలమ్మ తనదైన శైలితో ఆశీర్వదించి పంపింది.

" చేసిన వెధవ పని చాలక – ఇదొక దండుగ ఖర్చు ! దమ్మిడీ ముండకు ఏగాని క్షవరంట ! ఇప్పటికీ ఆలాయరు గాడు ఇంటల్లుడిలా మేస్తున్నాడు – ఇప్పుడు రైల్వే డిపార్టుమెంటును – టూరిజం డిపార్టుమెంటును పోషించాల్సి వస్తుంది."

సుబ్రావు పుణ్యం వస్తుందని దారిలోని కొన్ని పుణ్యక్షేత్రాలు ఎంచుకున్నాడు.

రెండు రోజులు కష్టపడి ప్రయాణం చేసి ఆ ఊరు చేరుకున్నాడు. అక్కడి బాష యితగాడికి రాదు ఇతడి బాష వాళ్ళకు రాదు ఇతని కొచ్చిన కాస్త ఇంగ్లీషు వాళ్ళకు రాదు అసలు.

ఆఫీసర్ని కల్సి అన్నీ వివరించాడు వచ్చీరాని ఇంగ్లీషులో –

తీరా తెల్సిందేమంటే చంద్రమోహన్ పది హేనురోజులుగా సెలవు మీద ఉన్నాడట – ఇంటి అడ్రసు అడిగితే ఎవరు సరిగా చెప్పలేదు – ఎక్కడికి పోయాడంటే కూడ ఎవరికీ సరిగా తెలీదు.

" ఈ ఆంధ్రా వాలాల గురించి మాకేం తెలుస్తుంది – థూ !" ఒకడు వాళ్ళ బాషలో తిట్టుకున్నాడు.

పట్టువదలని విక్రమార్కుడు కాబట్టి అతనొచ్చేలోగా పుణ్యతీర్థాలు సేవిద్దామని నిర్ణయించుకుని – టూరిజం డిపార్టుమెంటు సాయంతో ఓవారం టూరు చేసి కొన్ని వేలు తగలేసుకున్నాడు.

మళ్ళీ ఆఫీసుకు పోయేసరికి తెల్సిన కబురు ఏంటంటే చంద్రమోహన్ వచ్చాడు కాని – క్యాంపు పోయాడట!

మరునాడు దాకా ఉండి – ఉదయానే ఆఫీసుకు వెళ్ళాడు –

ఎప్పుడో నిదానంగా పదకొండుకు వచ్చాడు చంద్రమోహన్ – తన సీటు దగ్గర కూర్చుని వున్న సుబ్రావును చూసి పలకరించాడు.

" ఏం సుబ్రావు బాగున్నావా ? చాలా దూరం వచ్చావు – పిల్‌గ్రిమ్ ట్రిప్పా!"

" నాపిండాకూడు – నీ కోసమే ! నిన్ను చూడ్డానికే !" కోపంగా చెప్పాడు.

" అయ్యో ! నేనంతటి అదృష్టవంతుడినా?!"

" మరి కాదేంటి ! ఎన్ని లెటర్లు రాసినా రిప్లయి లేదు - ఎన్ని ఫోనులు చేసినా జవాబు చెప్పే వెధవ లేడు - అసలు నేను మీ కళ్ళకు ఎలా కనిపిస్తున్నాను?"

" చూశావుగా నేనెంత బిజీనో - క్యాంపుల మీద క్యాంపులు - క్షణం తీరిక ఉండటం లేదు - ఇంతకీ చెల్లెమ్మ - పిల్లలు బాగున్నారా ?"

" నీ దయవలన అంతా క్షేమం - ఇంతకీ నాకెందుకింత ద్రోహం చేశావు"

" అరే ! పెద్ద మాట మాట్లాడుతున్నావు - నువ్వు నాకు చాలా కావాల్సినవాడివి! నాకు ఆప్తుడివి !"

" మరి - నా శాలరీకి ఎటాచ్ మెంటు చేస్తారట నువ్వు కట్టాల్సిన డబ్బు !"

" ఈజిట్ !" ఆశ్చర్య పోయాడు చంద్రమోహన్ ఆ విషయం అప్పుడే కొత్తగా విన్నట్లు.

" ఆ ! నీ నాటకాలు కట్టిపెట్టు - వాళ్ళకు నువ్వు డబ్బెందుకు ఎగ్గొట్టావు - తీసుకున్నప్పుడు కట్టాల్సిందేగా ?"

" కట్టనని నేను చెప్పలేదే - కాస్త డిఫాల్టు అయ్యాను - అంతే ! చేతిలో డబ్బులు రాగానే కట్టేస్తాను."

" మరి నాకు నోటీసు పంపాడు-"

" వాడు తొందర పడ్డాడు - నువ్వు సైలెంటుగా ఉండు - నేచూసుకుంటా - "

" అరే - నా శాలరీకి అటాచ్ మెంటు వస్తూంటే నేను సైలెంటుగా ఎలా వుంటాను? - నువ్వు మొత్తం ఆ డబ్బు కట్టేస్తే అప్పుడు నాకు మనశ్శాంతి ఉంటుంది."

" నిజమే ! కడితే నాకు మనశ్శాంతి ఉండదుగా !"

" నువ్వు నాకు డబ్బులివ్వక పోతే పది మందిలో పంచాయితీ పెట్టి నీ పరువు తీస్తా!"

అంటూ ఆవేశ పడిపోయాడు సుబ్బారావు. చంద్రమోహన్ అతన్ని శాంతపరిచాడు తమ పాత స్నేహం గుర్తు చేసి.

" సాయంత్రం ఇంటికి రా, మాట్లాడుకుందాం. ఇంకేవన్నా చెప్పు. నాకు అర్జెంటు పనులున్నాయి." అంటూ టాపిక్ మళ్ళించి - ఓ పది నిమిషాలు మాట్లాడి పంపించేశాడు.

సాయంత్రం అతనెంబడి అతనింటికి వెళ్ళాడు.

" గురూ ! నువ్విక్కడే ఉండు - కొంచెం బయట అర్జెంటు పని ఉంది - వస్తా - " అంటూ వెళ్ళి పోయాడు చంద్రమోహన్ - అతని సమాధానం కోసం ఎదురు చూడకుండా - అతని భార్య చంద్రకళ " అన్నయ్య గారు !" అంటూ అతని చెయ్యి పట్టుకుని ఏడ్చింది. "ఊరు కాని ఊరు తెచ్చి పడేశాడు - పిల్లలకు చదువులు దెబ్బతిన్నాయి - అక్కడ ఊర్నిండా అప్పులు చేశాడు - ఇక్కడా చేస్తున్నాడు - నా ఆరోగ్యం సరిగా లేదు - డాక్టర్ల దగ్గరకి పోదామంటే వేలకు వేలు కావాలి !" అంటూ తన కష్టాలు చెప్పుకొచ్చింది ఏడుస్తూ.

ఓ గంట విన్న తర్వాత సుబ్బారావుకు డౌటు వచ్చింది ఆమె బోసి మెడని చూసి - పేదరికం తాండవమాడుతున్న ఇంటిని చూసి.

" ఇంతకీ ఈ డబ్బంతా ఏం చేస్తున్నాడు?!"

" పేకాట ఆడుతాడు- మట్కాకూడ అలవాటుందని కొందరంటారు - ఇంక మందు పిచ్చి - పిల్లల పిచ్చి ఉందని నీకు తెల్సుగా అన్నయ్య !" చాలా తాపీగా చెప్పింది, ప్రతి మొగాడికీ అవి ఉంటాయన్నట్లు భావించుకుంటూ.

ఆశ్చర్యపోయాడు సుబ్బారావు - అవేవీ అతనికి తెలియనివి.

" అన్నయ్యా ! ఓ రెండు వేలు అప్పిచ్చి పో అన్నయ్యా ! పిల్లలకు కాలేజి ఫీజులు కట్టాలి - ఇవి చేతులు కావు - " అంటూ కాళ్ళ మీద పడింది.

సుబ్బారావు మనసు వెన్న కాబట్టి యివ్వక తప్పింది కాదు -

రాత్రి తొమ్మిదికి తూలుకుంటూ వచ్చి - చంద్రమోహన్ - చంద్రకళను బూతులు తిట్టాడు - సుబ్బారావు కు చంద్రకళకు అక్రమ సంబంధం అంట కట్టి - తిట్టి తిట్టి నిద్ర పోయాడు.

సుబ్బారావు - చెపులూపుకుంటూ ఇంటికి చేరాడు. జరిగింది తెల్సుకుని

అప్పలమ్మ చెడా మడా తిట్టింది అతన్ని – అతని ఫ్రండును.

ఆఫీసుకు పోగానే కోర్టు అటాచ్‌మెంటులెటరు కన్పించింది. నెలకు రెండు వేలు 'హుష్ కాకి' – అలా పాతిక నెలలు !

లాయరు దగ్గరికి పరుగెట్టాడు 'ఇదేమి అన్యాయం – అన్ని వేలు ఫీజులు గుమ్మరించాను' అంటూ.

" టేకిట్ ఈజీ ! పూర్వజన్మలో నువ్వు వాడికి బాకీ పడి ఉంటావు – దాన్ని ఈ జన్మలో తీర్చుకుంటున్నావు !" శ్రీ కృష్ణ పరమాత్మ లాగా చెప్పాడు – చిరునవ్వుతో.

"మరి మీ కోర్టు ఫీజులు ఎందుకు కట్టినట్లు?"

"అనుభవం కోసం సుబ్బారావు – జీవితంలో యింకోసారి నువ్వు తప్పు చేయకుండా ఉండటం కోసం !" నిర్లిప్తంగా చెప్పాడు లాయరు.

(ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక 27-10-2005)